## క్లుప్తంగా

### ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ తేజోఫణీంద్ర

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రాజమహేంద్రవరం వేద స్పైన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ కొమరం శ్రావణి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్ రావు ప్రారంభించారు. ప్రముఖ వెన్నుముక వైద్య నిపుణులు డాక్టర్ తేజోఫణీంద్ర సుమారు 90 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సుమారు 80 శాతం మంది వెన్నుముక సమస్యతో బాధపడుతున్నారన్నారు. సరైన చికిత్స తీసుకోవడం ద్వారా సమస్యను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ పీవీ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలు



మల్లిసాలలో ప్రజలకు కేంద్ర పథకాలు వివరిస్తున్న బీజేపీ నేత వర్మ

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల, మర్రిపాక గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలు నిర్వహించారు. ఎంపీడీఓ వసంతకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంకల్పయాత్రల్లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ ముఖ్య అతిథి పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్న నిధులను వివరించారు. సుకన్య సంమృద్ధి యోజన, బేటి పడవో.. బేటి బచావో, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సర్వసిద్ధి నూకరత్నం, ముండ్రు ఎర్రబాబు, బీజేపీ నేతలు కందుల అచ్యుతరామయ్య, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### ఎరువుల దుకాణాలపై దాడులు



గోకవరం మండలంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గోకవరం: మండలంలోని పలు ప్రైవేటు, సొసైటీ కార్యాలయాల్లో ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏఓ రాజేశ్వరి మండలంలోని 14 ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి స్టాకు నిల్వల్లో హెచ్చుతగ్గులు ఉన్న సుమారు రూ.33 వేలు విలువ గల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎరువులు నిల్వల్లో తేడాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ముస్లిం పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బషీరుద్దీన్



మహమ్మద్ బషీరుద్దీన్

ప్రత్తిపాడు: ముస్లిం పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కాకినాడ జిల్లా కన్వీనర్‌గా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మహమ్మద్ బషీరుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జియావుద్దీన్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. బషీరుద్దీన్‌ను స్థానిక ఎంపీపీ పాఠశాల కమిటీ చైర్మన్ కట్టమూరి కొండబాబు తదితరులు అభినందించారు.

### బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో బెల్ట్ షాపులపై జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు గురువారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో గండికోట సత్యనారాయణకు చెందిన షాపులో 43, గండికోట వీరరాఘవులుకు చెందిన షాపులో 30 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### శరభవరంలో కోడి పందేలపై దాడి

ప్రత్తిపాడు: మండలంలోని శరభవరం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. జూదరులు పరారు కాగా సంఘటన స్థలం నుంచి రెండు కోడిపుంజులు, ఒక కత్తి, రూ.1450 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తెలిపారు.

# ప్రగతి పథంలో ముందుకు..

- అభివృద్ధిలో దూసుకుపోతున్న తుని మున్సిపాలిటీ
- ప్రజలకు మౌలిక వసతులు కల్పించాం
- కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ సుధారాణి





సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుధారాణి, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తుని: పురపాలక సంఘం ప్రగతి పథంలో దూసుకుపోతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి దాడిశెట్టి రాజా ఆశీస్సులతో పట్టణంలో దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరించామన్నారు. తుని పురపాలక సంఘంలో గురువారం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొంది పరిచిన 64 అంశాలను సభ్యులు ఏకగ్రావంగా ఆమోదించారు.

**జీరో అవర్లో సమస్యలపై చర్చ**

జీరో అవర్లో కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో ఒకటో వార్డులో అభివృద్ధి జరగలేదని, ప్రస్తుత పాలకవర్గంలో పలు సీసీ రోడ్లు నిర్మించారని కౌన్సిలర్ వారాధి జ్యోతి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసినందుకు చైర్‌పర్సన్ సుధారాణి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ స్తంభం మార్పు చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులు ఎక్కువగా రావడంతో పలువురికి వైఎస్సార్ చేయూత పథకం అందలేదని 3వ వార్డు కౌన్సిలర్ కర్రి సత్య జగదీష్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ బిల్లులు ఎందుకు ఎక్కువగా వచ్చాయో ట్రాన్స్‌కో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. ఆది ఆంధ్రా కమ్యూనిటీ హాలు అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు మట్లాడుతూ పట్టణంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కౌన్సిలర్లు అంతా మంత్రి దాడిశెట్టి విజయానికి కృషి చేయాలని కోరారు. మూడు నెలల పాటు అందరూ ఎన్నికలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కమిషనర్ ప్రసాదరాజు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే



మల్లవరంలో పార్టీలోకి చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న తోట నరసింహం

- ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- మల్లవరంలో వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక

గోకవరం: రాష్ట్రంలో మళ్లీ రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని మల్లవరంలో మాజీ సర్పంచ్ సేనాపతి త్రిమూర్తులు ఆధ్వర్యంలో మోతి పద్మనాభుడు, సేనాపతి నూకరాజుతో పాటు సుమారు వంద మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి తోట నరసింహం కండువాలు వేసి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో తిరిగి అధికారం చేపడతారన్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన వారు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు గోకాడ చిట్టిబాబు, మడికి మైనర్‌బాబు, సీహెచ్‌సీ కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, సమ్మెటి నాని, దాసరి చినబాబు, పల్లెల నాగబాబు, అల్లంగి వెంకన్న, గోరుముచ్చు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని పారుపాక, శృంగవరం గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ గురువారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని చెప్పారు. అలాగే రౌతులపూడి ఎస్సీ పేటలో అక్రమంగా సారా విక్రయిస్తున్న ముసలయ్యను అదుపులోకి తీసుకుని అతని నుంచి 72 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఈబీ అధికారులు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారని తెలిపారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



తునిలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

తుని: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తుని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పి.మాధవ రావు కోరారు. ఈ మేరకు గురువారం తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్, సబ్ ట్రెజరీ అధికారికి సమర్పించారు. కార్యక్రమంలో తుని పెన్షనర్స్ సంఘం కార్యదర్శి త్రిమూర్తులు, కోశాధికారి కృష్ణ, ఉపాధ్యక్షుడు ఆంజనేయ ప్రసాద్, కె.జోసెఫ్, అప్పలకొండ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కారించాలని పెన్షనర్ల వినతి**

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని పెన్షనర్లు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంఘ అధ్యక్షుడు ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీలో ఎరియర్స్ చెల్లించి హెల్త్‌కార్డు ద్వారా వైద్య సేవలు అందించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చెన్నాప్రగడ సత్యగాంధీ, గంగాధరరావు, మజ్జి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

**డిమాండ్లు పరిష్కరించాలి**

కోటనందూరు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కుశరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ ప్రతినిధులు మామిడి సత్యనారాయణ, లెక్కల స్వామినాయుడు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



జగ్గంపేటలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత రఘురాం

జగ్గంపేట: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలోని ప్రజలకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం అభినందనీయమన్నారు. ఆరోగ్యశ్రీని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గొల్లపల్లి శ్రీను, వైఎస్సార్ సేవాదళ్ మండల కన్వీనర్ కిలపర్తి వీరబాబు, పార్టీ నాయకులు కాపారపు ప్రసాద్, నీలపల్లి అప్పారావు, రెడ్డి భాను, కోరాడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం



ఎ.కొత్తపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి జగనన్న చేయూత మహిళా మార్ట్‌లో గురువారం లక్కీ డ్రా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళా మార్ట్ సూపర్ సేల్స్‌లో భాగంగా రూ.1000 విలువైన నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసిన వినియోగదారులను లక్కీ డ్రాకు ఎంపిక చేశారు. గ్రామ సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు సాపిశెట్టి చిన్న తదితరుల సమక్షంలో డ్రా తీశారు. బెండపూడికి చెందిన గండ్రెడి దుర్గ (ప్రథమ), ఎస్కే ఫాతిమా(ద్వితీయ), వి.పంపాదిపేటకు చెందిన బెనుగు వెంకటలక్ష్మి (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. వీరికి చంద్రగిరి, సాపిశెట్టి చిన్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌క్రాంతి పథం ఏపీఎం వై.సత్తిబాబు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అడ్డాల సూర్యకాంతం, సీఆర్పీలు, సీసీలు పాల్గొన్నారు.

## పారదర్శక పాలన జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు
- చినశంకర్లపూడి, టి.రాయవరం గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు



చినశంకర్లపూడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు: పారదర్శక పాలన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని చినశంకర్లపూడిలో సర్పంచ్ ఏపూరి రామారావు, టి.రాయవరంలో ఎంపీటీసీ తటవర్తి రామన్నదొర ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. తొలుత చినశంకర్లపూడిలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో మెయిన్‌రోడ్డు గుండా ర్యాలీ నిర్వహించి, నగరుల రామాలయం వద్ద గల వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వరుపుల సూరిబాబు, మాజీ సర్పంచ్ ఏపూరి ఏడుకొండలు, పిడుగు సత్తిబాబు, తటవర్తి అయ్యన్నదొర, పినిశెట్టి ప్రకాష్, తటవర్తి ప్రసాద్, కొండి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



కోటనందూరులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. కోటనందూరులో 88 మంది లబ్ధిదారులకు గురువారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను దగ్గర నుంచి చూసిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారం, మాయ మాటలు నమ్మొద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా పాలన సాగిస్తున్న సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజాకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ ఉమారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఎంసీ మండల చైర్మన్ సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, దార్ల సూర్యచంద్ర, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, ఉల్లూరి శ్రీను, తోలెం విజయరాజు తదితరులు పాల్గొన్నారు

## వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, కోట వంశీ, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 49 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

## నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



బ్యాడ్మింటన్ విజేతలను అభినందిస్తున్న ఎంపీడీఓ కుమార్‌బాబు

ప్రత్తిపాడు: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆడుదాం-ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను గురువారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్లలో తొలి మూడు స్థానాల విజేతలకు రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో గెలుపొందిన విజేతలకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కె.కాశీవిశ్వనాథం, ఎంఈఓ వి.రాజబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, రాపా గుర్రాజు పాల్గొన్నారు.

**విజేతలు వీరే**

బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ విభాగంలో జె.సీతారామరాజు, ఎస్.సురేష్ (ప్రత్తిపాడు మండలం) ప్రథమస్థానం కాగా.. ద్వితీయ స్థానంలో డి.అశోక్, బి.శ్రీనివాస్ (ఏలేశ్వరం మండలం), తృతీయ స్థానంలో ఎస్.గోపీనాథ్, ఆర్.సిద్ధార్థ్ (రౌతులపూడి మండలం) నిలిచారు. బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ విభాగంలో అడ్డూరి సుధ, ధరణి (ఏలేశ్వరం మండలం) ప్రథమ స్థానంలో నిలవగా పి.పాప, ఆర్.శిరీష (శంఖవరం మండలం) ద్వితీయ స్థానాన్ని, కె.విజయ, ఎస్.పావని తృతీయ స్థానాలను (ప్రత్తిపాడు మండలం) కైవసం చేసుకున్నారు. విజేతలను ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు అభినందించారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు
- సీనియర్ ఓటర్లకు సత్కారం





కోటనందూరులో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే వజ్రాయుధమని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కొత్తగా ఓటు హక్కు పొందిన 15 మంది యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. సీనియర్ సిటిజన్లను సత్కరించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల) టి.శ్రీనివాసరావు, ఈఓఆర్డీ కె.కాశీ విశ్వనాథం, డిప్యూటీ తహసీల్దార్లు కె.పుణ్యవతి, ఆర్.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని, దానిని సమాజ హితం కోసం వినియోగించాలని తహసీల్దార్ కె. కుశరాజు సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ కుశరాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ ఓటుహక్కు వినియోగం, దాని ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బస్టాండ్ సెంటర్ వరకూ ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేఈ చిన్నయ్యపాలెం ఎంపీపీ స్కూల్లో లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం**

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరం పట్టణంలో తహసీల్దార్ చిన్నారావు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారి, బాలాజీచౌక్ మీదుగా ర్యాలీ చేసి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత నగర పంచాయతీ కార్యాలయంలో సీనియర్ ఓటర్లు ఉద్దగిరి సోమరాజు, సామంతుల రామన్నలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, వాగు బలరామ్, కాకాడ నాగేశ్వరరావు, సుంకర రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్, కొత్త ఓటర్లను తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**గ్రామాల్లో ర్యాలీలు**

కిర్లంపూడి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తామరాడలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎల్.కృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ చేశారు. ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సివిక్స్ అధ్యాపకులు బావిశెట్టి లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు ఎ.విష్ణు, ఉమా శ్రీదేవి, తుక్కయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

**ఓటుహక్కును వినియోగించుకోవాలి**

శంఖవరం: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను శాలువా, పూలమాలతో సన్మానించారు. గ్రామాల్లో ర్యాలీలు చేసి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

తొండంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. అధికారులు ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసపులేటి సతీష్, ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, ఆర్ఐ గెట్టం వెంకటేశ్వరరావు, వీర్వోలు కె.విజయసత్యమూర్తి, ఎం.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నియోజకవర్గంలోని 223 పోలింగ్ కేంద్రాల పరిధిలో సీనియర్ ఓటర్లను సత్కరించి, కొత్తగా ఓటు హక్కుపొందిన యువకులను అభినందించినట్టు ఈఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. పలు పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ఎస్.అన్నవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వో కృష్ణ, కార్యదర్శి మధుశేఖర్, కుసనం దొరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో సీనియర్ ఓటర్లను సత్కరించిన అధికారులు



ఏలేశ్వరంలో సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న అధికారులు



శంఖవరంలో ఓటర్లను సత్కరించిన అధికారులు



తొండంగిలో సీనియర్ ఓటర్లను సత్కరించిన అధికారులు